# హైపో థైరాయిడిజం

"జనాభాలో నూరు మందిలో ఒక్కళ్ళకి థైరాయిడ్ హార్మోను లోపం వల్ల వివిధ అనారోగ్య పరిస్థితులు ఏర్పడుతున్నాయి. హిమాలయ ప్రాంతాల్లోనూ, మరికొన్ని పర్వత ప్రాంతాల్లోనూ థైరాయిడ్ లోపం వల్ల నూటికి పదిమందిలో ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. ఐడిన్ ఉన్న ఉప్పు వాడితే ఇటువంటి సమస్యలని నివారించవచ్చు. థైరాయిడ్ లోపం లేనివారు కూడా రోజూ వాడే ఉప్పు మోతాదులో ఐయోడైజ్డ్ సాల్ట్ ఉన్నా ఎటువంటి చెడు ఫలితాలు ఉండవు. పైగా థైరాయిడ్ గ్రంధి సమస్యలు తలెత్తడం తగ్గుతాయి" అని ప్రముఖ వైద్యులు డా॥కె.సత్యనారాయణరావుగారు పేర్కొన్నారు. వాసవ్య నర్సింగ్ హోమ్‌లో శనివారం జరిగిన ఆరోగ్య సదస్సులో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొని "హైపో థైరాయిడిజం" విషయంపై ప్రసంగించారు. ఈ సదస్సుకు డా॥సమరం అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిధిగా పాల్గొన్న డా॥సత్యనారాయణరావు మాట్లాడుతూ మెడ ముందు థైరాయిడ్ గ్రంధి ఉంటుందని, దాని ద్వారా థైరాక్సిన్ హార్మోను తయారవుతుందని, ఇది శారీరక, మానసిక ఎదుగుదలకి చాలా అవసరం అన్నారు. థైరాయిడ్ గ్రంధి తక్కువ పని చేసినప్పుడు థైరాక్సిన్ హార్మోను ఉత్పత్తి తగ్గిపోతుందన్నారు. థైరాయిడ్ గ్రంధి కొందరిలో ప్రత్యేక కారణం ఏదీ లేకుండా పనిచేయడం ఆగిపోతుందని, మరికొందరిలో తీసుకునే ఆహారంలో ఐడిన్ లోపం వల్ల లోపం ఏర్పడుతుందన్నారు. ఇన్‌ఫెక్షన్ రావడం వల్ల, కొన్ని రకాల మందుల దుష్ప్రభావం వల్ల, కంతుల వల్ల థైరాయిడ్ గ్రంధి పని తగ్గుతుందన్నారు. పుట్టుకతోనే కొందరిలో థైరాయిడ్ గ్రంధి పనిచేయకపోవడం ఉండవచ్చున్నారు. థైరాయిడ్ గ్రంధి తక్కువ పని చేసేవాళ్ళల్లో ఎప్పుడూ అలసిపోయినట్లు అనిపించడం, నిద్రలేమి, బరువు పెరగడం, చలిని తట్టుకోలేకపోవడం, బొంగురు గొంతు తలెత్తడం లక్షణాలు ఉంటాయన్నారు. థైరాయిడ్ గ్రంధి లోపాన్ని ముందుగా గుర్తించి చికిత్స చేయకపోతే నాడి కొట్టుకోవడం తక్కువ అవడం, యాంజైనా గుండె నొప్పి రావడం, గుండె పెరగడం, గుండె పైన ఉండే పొరల్లో నీరు చేరడం ఉంటుందన్నారు. థైరాయిడ్ గ్రంధి లోపం వల్ల కండరాల నొప్పులు, బలహీనత వస్తాయన్నారు. థైరాయిడ్ గ్రంధి లోపం ఉన్నవారిలో డిప్రషన్, సైకోసిస్ లక్షణాలు ఏర్పడతాయన్నారు. థైరాయిడ్ గ్రంధి లోపం ఉన్నవారిలో రక్తహీనత అతి సాధారణం అన్నారు. స్త్రీలల్లో థైరాయిడ్ గ్రంధి లోపం అధికంగా ఉంటుందన్నారు. థైరాయిడ్ గ్రంధి లోపం ఉన్నవాళ్ళల్లో ఆరుగురు స్త్రీలు ఉంటే పురుషుడు ఒక్కరే ఉంటారన్నారు. స్త్రీలల్లో థైరాయిడ్ గ్రంధి లోపం ఉన్నప్పుడు సంతానం కలిగే అవకాశాలు తక్కువ అన్నారు. థైరాయిడ్ గ్రంధి లోపం వల్ల చర్మం డ్రైగా మారుతుందన్నారు. వెంట్రుకలు రాలిపోవడం ఎక్కువ అన్నారు. ఎక్కువకాలంగా థైరాయిడ్ లోపం ఉంటే చర్మం దళసరిగా మారడమే కాకుండా చర్మం క్రింద నీరు ఎక్కువ చేరుతుందన్నారు. ఇటువంటి వారిలో ముఖం ఉబ్బరంగా మారడం, పొట్టకి నీరు చేరడం, కాళ్ళు, చేతులు ఉబ్బుగా అనిపించడం, కళాహీనంగా కనిపించడం ఉంటాయన్నారు. థైరాయిడ్ లోపం ఉన్నవాళ్ళల్లో బుద్ధిమాంద్యం అతి సహజం అన్నారు. చిన్నపిల్లల్లో థైరాయిడ్ లోపం ఉంటే డల్‌గా కనిపించడమే కాకుండా ముఖానికి, పొట్టకి వాపు వస్తుందన్నారు. ఎదుగుదల ఉండదన్నారు. థైరాయిడ్ లోపాన్ని థైరాయిడ్ టెస్టుల ద్వారా అతి తేలికగా గుర్తించవచ్చున్నారు. థైరాయిడ్ లోపం ఉన్నప్పుడు థైరాక్సిన్ హార్మోను బిళ్ళలు జీవితాంతం వాడాలన్నారు. సాధారణంగా చికిత్స మొదలుపెట్టిన 2-3 వారాల్లో అనారోగ్య పరిస్థితులు తొలుగుతాయన్నారు.